ఆదర్శనగర్ సెక్షన్ ఇన్‌చార్జి మేనేజర్‌గా పూజిత



చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ **ఆదర్శ** నగర్ సెక్షన్ **ఇన్‌చార్జి** మేనేజర్‌గా **పూజిత** నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న యాదయ్య మణికొండ డివిజన్ జల్‌పల్లి సెక్షన్‌కు బదిలీ అయ్యారు. భగత్‌సింగ్‌నగర్ సెక్షన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పూజిత అదనపు బాధ్యతలు నిర్వహించాలని జీఎం అశోక్ ఆదేశించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



జగద్గిరిగుట్ట: కొంపల్లి మున్సిపల్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదుల ఆధారంగా మంగళవారం అధికారులు కూల్చివేతలు చేపట్టారు. సెంట్రల్ పార్క్ ప్రాంతంలో రెండు కమర్షియల్ షెడ్లను తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. దూలపల్లి పారిశ్రామికవాడలో సైతం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

మైసమ్మ ఆలయంలో అన్నదానం



ప్రత్యేక అలంకరణలో కట్ట మైసమ్మ

కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ కట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభించి అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 గంటల వరకు ఆలయ ప్రతినిధి వివేక్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

సుభాష్‌నగర్: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న దూలపల్లిలో అస్మిత్ కేలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ యోగాసన్ లీగ్ పోటీల్లో షాపూర్ నగర్ ఎస్ ఎస్ డి యోగా శాలకు చెందిన పూజిత, దివ్య ప్రతిభను కనబరిచారు.పలు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు సాధించారు. యోగా గురువులు మల్లేష్, విజయ్ కుమార్ వారిని అభినందించారు.

సర్టిఫికెట్లు అందజేత



చింతల్: మహిళలు తమ కాళ్లమీద తాను నిలబడటానికి టైలరింగ్ ఎంతో దోహదపడుతుందని లార్డ్స్ వెల్ఫేర్ ఆర్గనేజేషన్ వ్యవస్థాపకుడు లయన్ కె సురేష్‌కుమార్ అన్నారు. గణేష్‌నగర్‌లోని లార్డ్స్ వెల్ఫేర్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో టైలరింగ్ టీచర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ వేడుకలు ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మంగళవారం ఉదయం పరమ పదోత్సవం, బ్రహ్మోత్సవం, అన్నమయ్య స్వరార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పైపులైన్ చాంబర్‌పై యథేచ్ఛగా వ్యాపారాలు!



- వేలల్లో వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు
- పట్టించుకోని అధికారులు
- గోదావరి జలాలు కలుషితం!

చింతల్: నాలుగు దిక్కులకు నీటిని పంపింగ్ చేసే 1000/800 పైప్ లైన్ చాంబర్ 50 గజాలకు పైగా ఉంటుంది. గతంలో ఈ చాంబర్ పై ఇనుప రేకులు ఉండేది. 2016–17 సంవత్సరంలో సుమారు 12 లక్షల రూపాయలతో సిమెంటు స్లాబు వేసి చాంబర్ నిర్మాణం చేపట్టారు. ఈ చాంబర్‌ను కొంతమంది అక్రమార్కులు వినియోగించుకుంటున్నారు. మరి కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కిరాయిలకు ఇచ్చుకోవడానికి అనుకూలంగా మార్చుకొని ప్రతినెల సుమారు రూ.30 వేలు వసూలు చేస్తున్నట్లు అక్కడక్కడ చర్చించుకుంటున్నారు. తమ చాంబర్‌లో ప్రైవేట్ వ్యక్తులు కిరాయిలకు ఇచ్చుకుంటున్నప్పటికీ జలమండలి అధికారులు గమనించకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది.

కలుషిత జలాలు సరఫరా

చాంబర్ పైన, చుట్టుపక్కల వివిధ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఈ చాంబర్ పైన వ్యాపారాలు కొనసాగించ కూడదని గతంలో వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు తోపుడు బండ్లను తీసివేయించారు. కానీ నేడు వీటిపై జలమండలి అధికారులు దృష్టి పెట్టకపోవడంతో అక్రమ వ్యాపారాలు వెలిశాయి. ఈ చాంబర్‌లో మొత్తం ఐదు రకాల వాల్వ్‌లు ఉన్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ వాల్వ్‌ల ద్వారానే షాపూర్ నగర్ రిజర్వాయర్, బాలానగర్ రిజర్వాయర్, అదేవిధంగా హైదర్ నగర్‌కు, అల్వాల్‌కు వెళ్లే తాగునీటి పైపులైన్ల మళ్లింపు ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఈ చాంబర్లపైన అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వీటి ద్వారా వచ్చే నూనె, వంట గిన్నెల సామాగ్రిని చాంబర్‌పైన కడుగుతున్నారు. దీంతో చాంబర్లలోని వాల్వ్‌ల ద్వారా కడిగిన నీరు నేరుగా ఆయా రిజర్వాయర్లలో కలిసే అవకాశముంది. అక్కడి నుంచి ఈ నీరంతా కాలనీలకు, బస్తీలకు సరఫరా అవుతుంది. దీంతో ప్రజల ప్రాణాలకు పెనుముప్పుగా ఈ వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

యాసంగిలో 14,300 ఎకరాలకే రైతు భరోసా

- సాగు చేయని 64,700 ఎకరాలకు కట్
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ వెల్లడి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 14,300 ఎకరాల్లోనే రైతులు వివిధ పంటలు సాగుచేస్తున్నారని గుర్తించిన యంత్రాంగం వీటికే రైతుభరోసా అందజేయాలని నిర్ణయించింది. జిల్లాలో 40,960 మంది రైతులకు (పట్టాదారు పాసు పుస్తకాలు) 79 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వర్షాకాలం, యాసంగిల్లో 60 నుంచి 70 శాతం భూముల్లో పంటసాగు కావటం లేదని తెలుస్తోంది.

గత ప్రభుత్వంలో 79 వేల ఎకరాలకు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద జిల్లాలో 79 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించి పంట పెట్టుబడి సాయంలో భాగంగా రైతు బంధు పథకం కింద 35,596 మంది రైతులకు ప్రతి సీజన్‌లో రూ.33.10 కోట్ల చొప్పున ఏడాదిలో రూ.66.20 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈ లెక్కన పంటసాగుచేయని వెంచర్లు, కంచెలు, గుట్టలు, రాళ్ల భూములకు కూడా ఈ పథకం వర్తింపజేసినట్లు తెలుస్తోంది.

సాగుచేయని భూములకు నిలిపివేత..

కాంగ్రెస్ ప్రభుత్వం పంటసాగు చేయని భూములకు రైతుభరోసా పథకాన్ని నిలిపేస్తామని ప్రకటించటంతో పాటు పంటసాగు భూములను గుర్తించి నివేదించాలని కోరింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో రెవెన్యూ,వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పంటసాగు భూములపై సర్వే నిర్వహించింది. ఈ సంయుక్త సర్వే ప్రకారం జిల్లాలో యాసంగిలో 14,300 ఎకరాల్లో మాత్రమే రైతులు వివిధ పంటలు సాగు చేసినట్లు వెల్లడైంది. ఈ యాసంగి సీజన్‌లో రైతుభరోసా పథకంలో భాగంగా 14,300 ఎకరాలకు సంబంధించిన రైతులకు మాత్రమే పంట పెట్టుబడి సాయాన్ని అందజేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

ఎమ్మెల్సీ ఫలితాలను సీఎం సమీక్షించుకోవాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేష్

జగద్గిరిగుట్ట: ఇటీవలే జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు రాకపోవడానికి గల కారణాలను సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. మంగళవారం మగ్దూం నగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అధికారంలో ఎవరు ఉంటే వారికే అనుకూలంగా ఫలితాలు వచ్చేవని, కానీ ఇప్పుడు ప్రతిపక్షాలు గెలచుకోవడం విశేషమన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన ఓల్డ్ పెన్షన్ స్కీం హామీ పై మాట్లాడకపోవడం వల్ల ఉపాధ్యాయులు నేడు తిరస్కరించారని తెలిపారు. అలాగే గత ఎన్నికల సమయంలో సీపీఐ మిత్రపక్షానికి 2 ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు సామెల్, రవి, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

1,26,423 మంది విద్యార్థులకు 150 పరీక్ష కేంద్రాలు

సాక్షి,సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్, మల్కాజిగిరిజిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్ తెలిపారు. ఈనెల 5 నుంచి 25 వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 150 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వసతులను కల్పించామన్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ 64,107 విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, సెకండ్ ఇయర్ 62,316 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షల పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్కాడ్స్‌తో సహా ఐదు సిట్టింగ్ స్కాడ్స్‌ను నియమించినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో మెడికల్ టీమ్‌ను అందుబాటులో ఉంచామన్నారు.

ప్రజల సౌకర్యార్థం పనులు చేపట్టాలి

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ




ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రజల సౌకర్యార్థం అధికారులు పనులు చేపట్టాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలు, పెండింగ్ పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి, చందానగర్, కూకట్‌పల్లి సర్కిళ్ల పరిధిలోని ఆయా డివిజన్‌లలో ప్రజల ఇబ్బందులు తొలగిపోయేలా పనులు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రథమ ప్రాధాన్యతగా పనులు చేపట్టాలని, కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే చేపట్టాలన్నారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఈఈలు దుర్గా ప్రసాద్, కెవియస్ రాజు, గోవర్ధన్ గౌడ్, డీఈలు ఆనంద్, విశాలక్షి, దుర్గా ప్రసాద్, రమేష్, నిఖిల్, ఏఈలు జగదీష్, భాస్కర్, ప్రతాప్, ప్రశాంత్, సంతోష్, సంతోష్ రెడ్డి, రాజీవ్, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జన్‌ఔషధి కేంద్రాల్లో తక్కువ ధరకే మందులు

రసూల్‌పురా: ప్రధానమంత్రి భారతీయ జన్‌ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందిస్తున్నామని రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి అన్నారు. తిరుమలగిరిలో బీజేపీ నాయకుడు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో 'జన్‌ఔషధి ఏక్ కదం మాతృశక్తికి ఓర్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు సువిధా శానిటరీ ప్యాడ్స్, జన్ ఔషధి కప్పులు, ఇతర ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక సేవకుడు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా వివిధ ఉత్పత్తులు అందించడం అభినందనీయమన్నారు.



కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు

కార్యక్రమంలో డాక్టర్ మీనాక్షి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటర్ హ్యాండీకాప్డ్ వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణపై అవగాహన



సూచనలు చేస్తున్న పిడమర్తి ఉపేందర్

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కుత్బుల్లాపూర్ నందు ఇంటర్ మొదటి సంవత్సరం 694, రెండో సంవత్సరం 489 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కళాశాల పరీక్షల నిర్వహణ అధికారి పిడమర్తి ఉపేందర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఇన్విజిలెటర్స్ కు పరీక్షల నిర్వహణ గురించి తగు సూచనలు చేశారు. అదేవిధంగా విద్యార్థులు కూడా సమయపాలన పాటించాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి 8:30 గంటల నుంచి విద్యార్థులను అనుమతిస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



కుత్బుల్లాపూర్: ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ పాత్తూరి శివాజీ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షులు సతీష్ సాగర్ తదితరులు ఆయనను కలిసి సన్మానించారు.

విద్యార్థుల పరీక్షల సమయాన్ని మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేష్

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ రేగోడి నాగేష్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే 10వ తరగతి ప్రీఫైనల్స్ మిట్ట మధ్యాహ్నం 12:15 నుంచి 3:15 వరకు పరీక్ష నిర్వహించడం సరైంది కాదన్నారు. రంజాన్ మాసానికి విద్యార్థుల పరీక్షకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

నిజాంపేట్ : గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి చివాస్ వైన్ షాప్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడు ఎర్రరంగు షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి నట్లు పోలీసులు తెలిపారు. ఎడమ చేతి ముందుభాగంలో నల్లటి మచ్చ ఉంది. ఆచూకీ తెలిసిన వారు 9491060942 / 8712568270 నంబర్‌లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైకోర్టు ఆదేశాలు పట్టవా?

వెల్ఫేర్ అసోసియేషన్ డిజేబుల్డ్ ప్రెసిడెంట్ అంజయ్యగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్యగౌడ్

సుభాష్‌నగర్: దివ్యాంగులకు ప్రత్యేక కమిషనర్ (ఐఏఎస్ అధికారి)ని ఆరు వారాల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా ఇంత వరకు ప్రభుత్వం కేటాయించలేదని వెల్ఫేర్ అసోసియేషన్ డిజేబుల్డ్ ప్రెసిడెంట్, రిటైర్డ్ లెక్చరర్ జి. అంజయ్య గౌడ్ అన్నారు. సూరారంలోని లూయిస్ బ్రెయిల్ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 పీఆర్‌డీ యాక్ట్ ప్రకారం దివ్యాంగుల కోసం ప్రత్యేక కమిషనర్‌ను కేటాయించాలని, 2017లో కమిషనర్ నియామకం జరుపనున్నట్లు జీవో కూడా జారీ అయినట్లు తెలిపారు. కానీ అధికారులు ఇతర శాఖలకు చెందిన కమిషనర్‌కు దివ్యాంగుల బాధ్యతలు అప్పగించడంతో ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయమై 24 జూలై 2024న హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ దివ్యాంగులకు ప్రత్యేక కమిషనర్‌ను 6 వారాల లోగా నియమించాలని 12 డిసెంబర్ 2024న ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికీ ఆరు వారాలు గడిచిన ప్రభుత్వం దివ్యాంగులకు ఎలాంటి కమిషనర్‌ను నియమించలేదని తెలిపారు. సమావేశంలో యాదయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, సత్యం, మట్టయ్య, యు. అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజా శ్రేయస్సు కోసమే పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్(ఏ), కైసర్ నగర్‌లో రూ.32 లక్షలతో నూతనంగా మంజూరైన సీసీ రోడ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్థానిక సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తామన్నారు. అనంతరం స్థానికులు ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలరాం, రషీద్ బేగ్, పద్మ, లక్ష్మి, మహ్మద్ తాసిఫ్, లాల్ మహ్మద్, దుర్గేష్, హైమద్, జమీల్, మహ్మద్ దావూద్, జబ్బార్, సలీం, అలీమ్, పురుషోత్తం, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌కు స్పెషల్ జ్యూరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న మల్లేష్

జీడిమెట్ల: ప్రజలు సైబర్ క్రైం వలలో చిక్కకుండా సోషల్ మీడియా ద్వారా అవేర్‌నెస్ కలిగించినందుకు జాతీయ స్థాయిలో జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్నారు. మంగళవారం ఢిల్లీలోని ఢిల్లీ ఫెడరేషన్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీవారు స్మార్ట్ పోలీసింగ్ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ వ్యాప్తంగా సైబర్‌క్రైం మేనేజ్‌మెంట్ విభాగంలో వివిధ రాష్ట్రాల నుంచి 129 ఎంట్రీస్ రాగా.. అందులో గడ్డం మల్లేష్‌కు స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. ఆయన ఈ అవార్డును యూనియన్ మాజీ హోం సెక్రటరీ చేతుల మీదుగా అందుకున్నారు. పలువురు ఆయనను అభినందించారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

జీడిమెట్ల: ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం త్వరిగతిన నెరవేర్చకపోతే సమ్మెకు దిగుతామని ఆర్టీసీ కార్మికులు హెచ్చరించారు. మంగళవారం జీడిమెట్ల డిపో ముందు జేఏసీ నాయకులు ఆర్టీసీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. నూతనంగా కండక్టర్, డ్రైవర్ల నియామకాలు సైతం జరపాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకన్న, మౌలాన, కమలాకర్‌గౌడ్, బాబు, గోవర్ధన్, అశోక్, హరికృష్ణ, డానియల్ తదితరులు పాల్గొన్నారు.



డిపో ముందు నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

స్కూళ్ల వార్షిక ప్రణాళిక ఖరారు

- రూ.30.11 కోట్లతో విద్యా బడ్జెట్‌కు ఆమోదం
- ప్రభుత్వ విద్య బలోపేతం, వసతుల కల్పనకు చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతం చేసేందుకు అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మన ఊరు– మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు స్కూళ్లలో నిర్వహిస్తున్నారు. మరోవైపు వచ్చే విద్యా సంవత్సరంలో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ బడ్జెట్ రూపొందించింది. 2025–26 విద్యాసంవత్సరానికి రూ.30.11 కోట్లు జిల్లాకు అవసరమని ప్రతిపాదనలు పంపగా దీన్ని ఉన్నతాధికారులు ఆమోదించారు. ఈ నిధులు విడుదలైతే జిల్లాలో విద్యా సమస్యలు తీరుతాయని విద్యాధికారులు భావిస్తున్నారు.

◆ ఈ బడ్జెట్లో అధికంగా పాఠశాలల్లో వసతుల కల్పనతోపాటు విద్యను పూర్తిస్థాయిలో అందించేందుకు అవసరమైన నిధులు కావాలని విద్యాశాఖ నివేదించింది. జిల్లాలో మొత్తం 15 మండలాలు, 13 పురపాలిక సంఘాల పరిధిలో పీఎస్‌లు 375, యూపీఎస్‌లు 22, ఉన్నత పాఠశాలలు 108 ఉండగా, ఇందులో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

◆ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 176 ప్రభుత్వ పాఠశాలలో రూ.70 కోట్లతో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించగా, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ కమిటీల ద్వారా 286 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 689 మరమ్మతులు చేపట్టారు.

తాగునీరు..డిజిటల్ తరగతి గదులు..

◆ పాఠశాలల్లో ముఖ్యంగా తాగునీరు, డిజిటల్ తరగతులు, గ్రంథాలయాల నిర్వహణ వంటి విషయాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు రూపొందించిన ప్రస్తుత వార్షిక ప్రణాళిక ప్రకారం జిల్లాకు నిధులు విడుదలైతే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

యూడైస్ ఆధారంగా నిధులు..

◆ ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి నిధులు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. గతంలో ఇచ్చిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయటం లేదన్న సాకుతో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాకు మొత్తం రూ.30.11 కోట్ల నిధులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిధుల్లో అధిక శాతం విద్య, మౌలికవసతుల కల్పనకు కేటాయించారు.

◆ హెచ్‌ఎంలు ఆయా పాఠశాలలకు సంబంధించిన వివరాలు యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు చేసిన ఆధారంగానే ఈ నిధులు విడుదల కానున్నాయి. డిజిటల్ విద్య, ఉపాధ్యాయులకు శిక్షణ, గ్రంథాలయాల ఏర్పాటుకు కూడా నిధులను వినియోగించనున్నారు.

ఇంజనీర్లు అద్భుతాలను సృష్టించారు

- 'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు
- 'ఎస్కీ' ప్రాంగణంలో ప్రపంచ ఇంజనీరింగ్ దినోత్సవం

రాయదుర్గం: ప్రతి దేశం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే ఇంజనీర్ల పాత్ర కీలకమని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఇంజనీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఎస్కీ' ప్రాంగణంలో ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి అవసరమైన స్వచ్ఛ నీరు, సమర్థవంతమైన రవాణా, మౌలిక వసతుల పరిష్కారాలకు యువ ఇంజనీర్లు కృషి చేయాలన్నారు. వేల సంవత్సరాల ఈజిప్టు పిరమిడ్స్‌తో సహా వేలాది అద్భుతాలను ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీర్లు సృష్టించారని ఆయన గుర్తు చేశారు. ఇంజనీర్లు, అధికారులు జి నరేష్, అనిత అగర్వాల్, డాక్టర్ సాగర్, సాయికిశోర్, సిహెచ్ తిలక్, శ్రీకాంత్, జ్యోతి, సౌమ్య, మోహన్, డాక్టర్ మోహన్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు అమర్‌నాథ్, శ్రీధర్‌బాబు, డాక్టర్ కృష్ణమోహన్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ రాజారావు పాల్గొన్నారు.